## వడ్డెరులు రాజకీయంగా ఎదగాలి



వడ్డెరులు రాజకీయంగా ఎదగాలని అఖిల భారత వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేశ్ అన్నారు. బషీర్‌బాగ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో అధిక జనాభా ఉన్న వడ్డెర కులస్తులకు టికెట్లు కేటాయించాలన్నారు. 40 లక్షల జనాభా ఉన్న వడ్డెరులు రాజకీయం, ఆర్థికం, విద్యా , సామాజికంగా వెనుకబడి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలను కోరారు. **- రవీంద్రభారతి, అక్టోబర్ 13**

## సర్కిల్ -13 డీసీగా శశిరేఖ



మెహిదీపట్నం, అక్టోబర్ 13 : జీహెచ్ఎంసీ సర్కిల్ – 13 కార్వాన్ ఏరియా డిప్యూటీ కమిషనర్‌గా డి.శశిరేఖ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న మహ్మద్ యూసుఫ్‌ను హెడ్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. డీసీ శశిరేఖ మాట్లాడుతూ.. మస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని లంగర్‌హౌస్, గోల్కొండ, టోలిచౌకి, నానల్‌నగర్, కార్వాన్, జియాగూడ ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను చేపడుతామని తెలిపారు. ఇదిలా ఉండగా ఈఆర్‌వోగా శశిరేఖ నియమితులయ్యారు.

# పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి



లంగర్‌హౌస్ డివిజన్ నాయకులతో కార్వాన్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ

మెహిదీపట్నం, అక్టోబర్ 13 : సీఎం కేసీఆర్ అందించిన పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని కార్వాన్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. శుక్రవారం లంగర్‌హౌస్ లక్ష్మీనగర్ రింగ్‌రోడ్‌లో లంగర్‌హౌస్ డివిజన్ ముఖ్య నాయకులతో మిత్ర కృష్ణ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మిత్ర కృష్ణ మాట్లాడుతూ.. నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు తెలంగాణలో అమలవుతున్న పథకాల వివరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో సీనియర్ నాయకులు, అడ్‌హక్ కమిటీ సభ్యులు కె.సి.శేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఎన్.చంద్రకాంత్,ప్రధాన కార్యదర్శి కృష్ణదాస్,గడ్డి చందు,కార్తీక్ పాల్గొన్నారు.

### హ్యాట్రిక్ విజయం ఖాయం



నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్‌తో ముఖ్యనాయకులు

నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గం ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్ ముఖ్య నాయకులతో ఎన్నికల నేపథ్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు సంజయ్, ప్రదీప్ కుమార్ అగర్వాల్, జకీఉల్లా, అబ్దుల్ కలీం, మాజీద్, అశ్విన్ మార్గం పాల్గొన్నారు.

## బడీమసీద్ వద్ద ఎమ్మెల్యే పర్యటన



నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్ బడీమసీద్ ప్రాంతంలో శుక్రవారం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్, నగర మాజీ మేయర్, మెహిదీపట్నం కార్పొరేటర్ మాజీద్ హుస్సేన్, ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్ ఖాన్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడి పలు సమస్యలపై చర్చించారు. ప్రజల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులతో పనులను చేపట్టామని తెలిపారు. **- మెహిదీపట్నం, అక్టోబర్ 13**

## ప్రాతినిధ్యం కల్పించండి

రవీంద్రభారతి, అక్టోబర్ 13: ఎన్నికల్లో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, అలాంటి పార్టీలకే మద్దతు ఉంటుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహాసేన వెల్లడించింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశంలో మహాసేన జాతీయ అధ్యక్షుడు కొంగర అనిల్ కుమార్, తెలుగు రాష్ట్రాల చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ.. రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఐక్యమత్యంగా పనిచేయాలన్నారు. దామాషా ప్రకారం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ కోటా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.ఉదయ్‌కుమార్, మహారాజు అంజలి, బెల్లం మాధవి పాల్గొన్నారు.

## వీడీసీసీ రోడ్డు పనులు పరిశీలన



కార్వాన్ నియోజకవర్గం టోలిచౌకి డివిజన్ నీరజ కాలనీలో వీడీసీసీ రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్, డిప్యూటీ ఈఈ రామకృష్ణతో కలిసి పరిశీలించారు. పెండింగ్ పనులను అధికారులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్, టోలిచౌకి ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి మహ్మద్ హరూన్ ఫర్హాన్ పాల్గొన్నారు. **- మెహిదీపట్నం, అక్టోబర్ 13**

## పైపులైన్ నిర్మాణానికి చర్యలు



నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్ ఫీల్‌ఖానలో ఎన్‌పీ – 3 పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించడానికి జలమండలి అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. శుక్రవారం జలమండలి అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి ఎన్‌పీ – 3 పైపులైన్ నిర్మించే ప్రాంతాన్ని ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ పరిశీలించారు. రూ. 8 లక్షల నిధులతో ఈ పైపులైన్ నిర్మాణ పనులను చేపడుతున్నామని ఆయన తెలిపారు. **- మెహిదీపట్నం, అక్టోబర్ 13**

# శిబిరాల ఏర్పాటు అభినందనీయం



హనుమాన్‌టేక్డీలోని ప్రగతి మహా విద్యాలయంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న గుజరాతీ ప్రగతి సమాజ్ ఉపాధ్యక్షుడు మహేశ్ పటేల్




శిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న మహేశ్ పటేల్

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 13 : ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండేందుకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని గుజరాతీ ప్రగతి సమాజ్ ఉపాధ్యక్షుడు మహేశ్ పటేల్ అన్నారు. గుజరాతీ ప్రగతి సమాజ్ 50 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమాన్‌టేక్డీలోని ప్రగతి మహా విద్యాలయ డిగ్రీ కళాశాలలో మెడికల్ హెల్త్ చెకప్ క్యాంపు నిర్వహించారు. క్యాంపును ఆయన సమాజ్ సంయుక్త కార్యదర్శి, డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ గోపాల్ పటేల్, జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జితేన్ మజేతియా, సమాజ్ సభ్యులు ఘన్‌శ్యాం పటేల్, ఉదయ్ మెహతా, పీజీ డైరెక్టర్ డాక్టర్ వైకేఎం నాయుడు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ మాధవీలతలతో కలిసి ప్రారంభించారు. వైద్య శిబిరంలో భాగంగా పరీక్ష లను చేయించుకున్నారు. మహేశ్ పటేల్ మాట్లాడుతూ.. సమాజ్ స్వర్ణ వేడుకలను ఘ నంగా నిర్వహిస్తున్నట్లు, ఈ సందర్భంగా సమాజ్ సభ్యులతో పాటు పీజీ, డిగ్రీ, జూనియర్ కళాశాలల బోధన, బోధనేతర సిబ్బంది హెల్త్ చెకప్ చేయించుకున్నారు. శనివారం కళాశాలలో అలుమ్ని మీట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. శిబిరంలో మాక్సివిజన్, విజయ డయాగ్నస్టిక్ వైద్యు లు,సిబ్బంది పరీక్షలను చేపట్టారు.అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

## ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు

సైదాబాద్, అక్టోబర్ 13: ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని సైదాబాద్ ఆంధ్రాబ్యాంక్ కాలనీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్‌లో ఉచిత ప్రకృతి స్వస్థ్య అసెస్మెంట్ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుర్వేద మూల సూత్రాలలో ప్రకృతి ఒకటని, ప్రతి మనిషీ తన నిజ జీవితంలో ప్రకృతిని తెలుసుకోవటం, ఆచరించాల్సిన నియమాలు, మన శరీర తత్వానికి ఏది పథ్యమో ఏదీ కాదో తెలుసుకోవచ్చును. స్వస్థ్య అసెస్మెంట్ స్కేలు ద్వారా తనలో ఆరోగ్యం వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి పరిసర కాలనీవాసులకు నిష్ణాతులైన వైద్యులచే ప్రకృతి, స్వస్థ్య పరీక్షలను నెలరోజుల పాటు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 9441273178 నంబర్ ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కేటాయించిన సమయంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

## నిందితుడికి 9 నెలలు జైలు

చార్మినార్, అక్టోబర్ 13 : ఆభరణాల దుకాణంలోకి ప్రవేశించి, వెండి ఆభరణాలు చోరీ చేసిన ఓ నిందితుడికి న్యాయస్థానం జైలు శిక్ష విధించినట్లు చార్మినార్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. భవానీనగర్ పీఎస్ పరిధిలోని గంగానగర్‌కు చెందిన హైదర్ అలీ రజ్వీ అలియాస్ హైదర్ 2014లో చార్మినార్ పరిధిలో ఉన్న చేలాపురకు చెందిన జానకీరాం ఆభరణాల దుకాణంలో చోరీ చేశాడు. అర్ధరాత్రి దుకాణం తాళం పగులగొట్టి రూ.80 వేల విలువ జేసే 3 కిలోల వెండి ఆభరణాలను దొంగిలించాడు. మరుసటి రోజు ఉదయం దుకాణానికి వచ్చిన యజమాని.. చోరీ జరిగినట్టు గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నాంపల్లి ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. నిందితుడికి 9 నెలల జైలు శిక్షతో పాటు రూ.100 చలానా విధించారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.